సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 161. | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | ఆదివారం 30-08-2026

### గత ప్రభుత్వానికి నరకడం తప్ప

## నాటే ఆలోచనే రాలేదు



- ❖తమది నాటే సంస్కృతే కానీ, నరికేది కాదని స్పష్టం
- ❖మంగళగిరి అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు
- ❖హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు
- ❖రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్ల పరిశీలన

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు మిగతా 2లో

### ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా

## 'సంజీవని' అమలు

### ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు.. సీఎం చంద్రబాబు ప్రకటన

- ➤ఓ మాజీ మంత్రి కోడలిని మతం మారమన్నారు: సీఎం చంద్రబాబు
- ➤ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్లతో వైద్య సేవలు
- ➤మందులు, రక్త నమూనాల రవాణాకు డ్రోన్ల వినియోగం
- ➤పీహెచ్‌సీలను జిల్లా ఆసుపత్రులతో అనుసంధానించేలా ప్రణాళిక
- ➤టెక్నాలజీతో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- ➤మారుమూల ప్రాంతాల్లోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందిస్తామని హామీ
- ➤అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ➤రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం
- ➤మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ➤ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం
- ➤ఈ విషయాన్ని ఆమెనే స్వయంగా బయటపెట్టారని చంద్రబాబు వెల్లడి



గత ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిడులు జరిగాయని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఓ మాజీ మంత్రి ఇంట్లోనే మత మార్పిడికి ఒత్తిడి జరిగిందని, ఆయన కోడలే ఈ విషయాన్ని బయటపెట్టిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అరకు పర్యటనలో 'సంజీవని' కార్యక్రమంలో మిగతా 2లో

### తలక్రిందులుగా తపస్సు చేసినా..

## వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



- ▸▸ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం
- ▸▸ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.
- ▸▸జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు.

ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మిగతా 2లో

## వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్

- ●65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు అమెరికా నియంత్రణలోకి
- ●పెరుగుతున్న గ్యాస్ ధరల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వ కీలక వ్యూహం
- ●ఈ ఒప్పందంతో అమెరికాలో ఇంధన ధరలు తగ్గుతాయన్న అంచనాలు
- ●వెనెజువెలాలో 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ సంచలన ప్రకటన చేశారు. దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాతో చమురు ఒప్పందం కుదిరిందని, దీని ద్వారా మిగతా 2లో


## ఆర్ఎస్ఎస్, బీజేపీ మనుస్మృతిని అనుసరిస్తున్నాయి.

- ●రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
- ● కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో మనుస్మృతికి, డా. బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి మధ్య పోరాటం జరుగుతోందని అన్నారు.
- ●ఆర్ఎస్ఎస్, బీజేపీ మనుస్మృతిని అనుసరిస్తున్నాయి. మనుస్మృతి ఆధారంగానే దళితులపై వివక్ష కొనసాగుతోంది.



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో మనుస్మృతికి, డా. బీఆర్ అంబేద్కర్ రచించిన మిగతా 2లో

## వైసీపీలో నంబర్ 2 జగన్..
## నాది కోవర్ట్ రాజకీయం కాదు



- ❊2022లో సకల శాఖల మంత్రి నాపై భౌతికదాడి చేశారు.. జగన్ కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారు
- ❊సకల శాఖల మంత్రిగా సజ్జల.. జగన్‌కు గోడ కట్టారు
- ❊ప్లీనరీలో భౌతిక దాడి.. జగన్ ప్రేక్షకపాత్ర
- ❊వైసీపీలో తనకు ఎదురైన అవమానాలపై విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ
- ❊సజ్జల రామకృష్ణారెడ్డి ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్ అని సంచలన ఆరోపణలు

రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా పెను దుమారం రేపారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై నిప్పులు చెరుగుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేశారు. మిగతా 2లో

### ఎస్ఐఆర్ పై ఎన్నికల సంఘానికి

## రేవంత్ రెడ్డి లేఖ

### గడువు పెంచండి..

- ★ఎస్ఐఆర్ ప్రక్రియపై కేంద్రఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి శనివారం లేఖ రాశారు.
- ★ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువులు పొడిగించాలని కోరారు.
- ★మరో నాలుగు వారాల పాటు ఈ గడువును పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.
- ★వాటితో పాటు తుది ఓటర్ల జాబితా గడువునూ పెంచాలని కోరారు.
- ★73.39 లక్షల ఓటర్ల ఎంట్రీలు ASDD జాబితాలోకి వెళ్లాయని దీంతో తాత్కాలికంగా వెళ్లిన వారిని సైతం శాశ్వతంగా తరలివెళ్లినట్లు పరిగణించే అవకాశం ఉందని పేర్కొన్నారు.
- ★ఈ నేపథ్యంలో ఓటర్లు నోటీసులకు స్పందించేందుకు ఓటర్లకు సమయం ఇవ్వాలని సూచించారు.
- ★ఓటర్ల జాబితాలో అర్హుల ఓట్లు తొలగిపోకుండా చూడాల్సిన అవకాశం ఉందని ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.కాగా రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువును ఇదివరకే కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.



హైదరాబాద్: ఎస్ఐఆర్ ప్రక్రియపై కేంద్రఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి శనివారం లేఖ రాశారు. ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువులు పొడిగించాలని కోరారు. మరో నాలుగు వారాల పాటు ఈ గడువును పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వాటితో పాటు తుది ఓటర్ల జాబితా గడువునూ పెంచాలని కోరారు. 73.39 లక్షల ఓటర్ల ఎంట్రీలు ASDD జాబితాలోకి వెళ్లాయని దీంతో తాత్కాలికంగా వెళ్లిన వారిని సైతం శాశ్వతంగా తరలివెళ్లినట్లు పరిగణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లు నోటీసులకు స్పందించేందుకు ఓటర్లకు సమయం ఇవ్వాలని సూచించారు. మిగతా 2లో

### సోనియాగాంధీ ఆత్మకథలో
### ఇంకెన్ని అబద్ధాలు ఉన్నాయో?



- ⌘22ఏ భూముల సమస్యలపై పోరుబాట
- ⌘మరో రెండు పోరాటాలకు రెడీ అవుతున్న తెలంగాణ బీజేపీ
- ⌘సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏ భూముల వ్యవహారంపై దీక్ష
- ⌘ఆదిలాబాద్నుంచి అసెంబ్లీ వరకు రైతు యాత్ర

తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు మిగతా 2లో

## దివ్యాంగులపై దయ లేని
## ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా?

### నీ గురువు చేసింది.. నువ్వెప్పుడు చేస్తావ్ రేవంత్?

- ●దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు నిలదీశారు.
- ● దివ్యాంగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు.
- ● బీఆర్ఎస్ హయాంలో దివ్యాంగుల పెన్షన్ ను రూ.500 నుంచి రూ.4016కు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.



దివ్యాంగులపై దయ లేని ప్రభుత్వం కూడా ఒక ప్రభుత్వమేనా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు నిలదీశారు. ఎల్ బి నగర్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిగతా 2లో

### ఉద్యోగులను రెచ్చగొట్టేలా
### బొప్పరాజు వ్యవహరిస్తున్నారు



ఏపీ జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు వైఖరిపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు మేలు చేసేందుకు తమ ప్రభుత్వం చర్చలు జరుపుతోందని తెలిపారు.

ఏపీ జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు వైఖరిపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేలు చేసేందుకు తమ ప్రభుత్వం చర్చలు జరుపుతోందని తెలిపారు. మిగతా 2లో

### శ్రీశైలం ప్రాజెక్టులో 71 శాతం వరకు

## నీటి నిల్వలు ఉన్నాయి

### శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు

- ●సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్న
- ●నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన
- ●రైతులను ముంచడమే చంద్రబాబు ఉద్దేశమా?: కాకాణి



శ్రీశైలం ప్రాజెక్టులో నీటిని ఉపయోగించుకోవడంలో కూటమి పూర్తి స్థాయిలో విఫలం అయిందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. శ్రీశైలంలో నుంచి సోమశిల, కండలేదు జలాశయాలకు మిగతా 2లో

# జడ్పీ హై స్కూల్ లో ఘనంగా తెలుగు దినోత్సవం క్రీడా దినోత్సవ వేడుకలు





**డోన్ టౌన్, ఆగస్టు 29,(సీమ కిరణం న్యూస్);** తెలుగు దినోత్సవం, క్రీడా దినోత్సవాల వేడుకలను కొత్తపేట జడ్పీ హై స్కూల్ లో తెలుగు ఉపాధ్యాయులు లోకనాథ్ రెడ్డి, సువర్ణమ్మ వ్యాయామ ఉపాధ్యాయులు నారాయణ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు, ఈ దినోత్సవలాకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామనరసప్ప అధ్యక్షత వహించగా జయప్రద, చంద్రుడు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా రామనర్సప్ప మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు గురించి వివరంగా విద్యార్థులకు తెలియజేసారు, అలాగే విద్యార్థులకూడా క్రీడాస్పూర్తి, ఆరోగ్యం,క్రమశిక్షణ, పెంపొందించడానికి, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు, సీనియర్ ఉపాధ్యాయులు జయప్ర మాట్లాడుతూ మాతృ భాషతో పాటు మన సంస్కృతి సందేశన్నీ అందించారు , తెలుగు ఉపాధ్యాయులు లోకనాథ్ రెడ్డి, సువర్ణమ్మ విద్యార్థుల కు మాతృ భాష గురించి, తెలుగు సాహిత్యం గురించి వివరంగా విద్యార్థులకు తెలియజేసారు, విద్యార్థులచేత తెలుగు కవుల వేసాధారణ, వారు కవుల కవిత్వం, పద్యం చెప్పిన విధానం అందరినీ ఆకట్టుకున్నాయి, వ్యాయామ ఉపాధ్యాయులు నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ భారత్ హాకీ క్రీడా కారుడు దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ ను ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు, విద్యార్థులకు క్రీడల పట్ల శరీరక దృఢత్వం, క్రమ శిక్షణ నాయకత్వ లక్షణాలు మరియు జట్టు స్పూర్తి పెంపొందిస్తాయి అని అన్నారు,అనంతరం పాఠశాల ఇంచార్జీ ప్రధాన ఉపాధ్యాయులు చంద్రుడు విద్యార్థుల కోసం పద్యం రూపంలో సాహిత్యం మీద ఉన్న మమకారం, సత్య హరిచంద్ర నాటకం లో ఉన్న కాటి కాపరి పాత్ర గురించి పద్యం రూపంలో వివరంగా విద్యార్థులకు తెలుగు భాష గురించి తెలియజేసారు, తెలుగు దినోత్సవం తెలుగు ఉపాధ్యాయులు లోకనాథ్ రెడ్డి, సువర్ణమ్మ , మరియు వ్యవసాయ ఉపాధ్యాయులు నారాయణ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యం సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య కమిటీ చైర్మన్ ఖాజా హుస్సేన్, ఉపాధ్యాయులు సుధాకర్, లక్ష్మీదేవి, నాగ లక్ష్మమ్మ, సుజాత, పుష్పలత, రజనీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డోన్ లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 3 కె యం రన్







**డోన్ టౌన్, ఆగస్టు 29,(సీమ కిరణం న్యూస్):** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని యువతలో క్రీడా స్పూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో 3 కె యం రన్ ను ఘనంగా నిర్వహించారు.డోన్ పాత బస్టాండ్ గాంధీ సర్కిల్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా కేక్ కటింగ్ జరిగిన అనంతరం డీఎస్పీ శ్రీనివాసులు గ్రీన్ ఫ్లాగ్ ఊపి 3 కె యం రన్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి టౌన్ సీఐ ఇంతియాజ్ భాషా హాజరై యువతను ప్రోత్సహించారు,అలాగే స్థానిక వైద్యులు (డాక్టర్లు) కార్యక్రమానికి హాజరై పాల్గొన్న వారికి ఆరోగ్యం, వ్యాయామం మరియు క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.3 కె యం రన్‌లో యువత, క్రీడాకారులు, విద్యార్థులు, వ్యాయామ ప్రియులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. నేటి యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ప్రతిరోజూ రన్నింగ్, వ్యాయామం వంటి శారీరక కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా అందిస్తాయని తెలిపారు,మేజర్ ధ్యాన్ చంద్ దేశానికి అందించిన క్రీడా సేవలు, ఆయన క్రీడా ప్రతిభ నేటి యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమానికి హాజరై 3 కె యం రన్‌ను ప్రారంభించిన డీఎస్పీ శ్రీనివాసులు , టౌన్ సీఐ ఇంతియాజ్ బాషా లకు ధన్యవాదాలు తెలిపారు,వైద్యులు మరియు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యువత, క్రీడాకారులు, విద్యార్థులకు మోహన్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పట్టణ ఇంతియాజ్ భాష, సబ్ జైల్ సూపరింటెండ్ సురేష్, గీత యోగసన, రోటరీ క్లబ్ యువకులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## డోన్ డీఎస్పీ పి. శ్రీనివాస్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రశంసా పత్రం



**డోన్ టౌన్, ఆగస్టు 29,(సీమ కిరణం న్యూస్):** డోన్ సబ్ డివిజన్ పరిధిలో మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు డోన్ డీఎస్పీ పి. శ్రీనివాస్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రశంసా పత్రాన్ని అందజేసింది.డోన్‌లో నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరంలో 565 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు మరియు రక్తదాతలు విశేషంగా సహకరించారు.ఈ సందర్భంగా డీఎస్పీ పి. శ్రీనివాస్ తరపున టౌన్ సీఐ శనివారం నంద్యాలలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మరియు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు.ఈ మెగా రక్తదాన శిబిరంలో డోన్ టౌన్, డోన్ రూరల్, ప్యాపిలి, బేతంచెర్ల, జలదుర్గం, రాచర్ల, బనగానపల్లి, అవుకు, నందివర్గం పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు ఆయా మండలాలకు చెందిన రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు.రక్తదానం ద్వారా అత్యవసర సమయాల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజలు మరింతగా భాగస్వాములు కావాలని పోలీసు అధికారులు కోరారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రజలు, రక్తదాతలు, వైద్యులు, పోలీసు అధికారులు మరియు సిబ్బందికి, అలాగే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు పోలీసు శాఖ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# ఎయిడ్స్‌పై అవగాహనకు "ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర" ప్రారంభం



**కర్నూలు వైద్యం, ఆగస్టు 29, (సీమకిరణం న్యూస్) :** ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు "ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర" ను శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణంలో ప్రారంభించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, జిల్లా కుష్టువ్యాధి మరియు ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ కలిసి అవగాహన వాహనాన్ని ప్రారంభించారు. ఈ వాహనం 15 రోజుల పాటు కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎయిడ్స్ వ్యాధి నివారణ, వ్యాధి వ్యాప్తి మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను వీడి, వ్యాధి నివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎయిడ్స్‌పై సరైన అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.

## హోటల్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్.. ఇద్దరికి గాయాలు



**ప్యాపిలి ఆగస్టు 29 (సీమ కిరణం న్యూస్):** రాయలచెరువు నుంచి డోన్‌కు వెళ్లే రహదారిలోని పీఆర్ పల్లి గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం సుమారు 12:45 గంటల సమయంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు జల దుర్గం ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. స్పీడ్ బ్రేకర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేక పోవడంతో పక్కనే ఉన్న లక్ష్మీదేవి హోటల్‌లోకి ట్రాక్టర్ దూసుకెళ్లింది.ఈ ఘటనలో నల్లమేకలపల్లికి చెందిన హోటల్ యజమాని ప్యారం బయపురెడ్డి (78), లక్ష్మీదేవి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్





**కర్నూలు వైద్యం, ఆగస్టు 29, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు వారిని పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సూపరింటెండెంట్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వివరించిన సమస్యలను సంబంధిత పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, వైద్య సేవల్లో అంతరాయం ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులకు హాజరై తమ విధులను నిర్వర్తించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు సూచించారు.

## యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో!

కర్నూలు అసెంబ్లీ యువతకు ఈఆర్వో, కమిషనర్ పిలుపు

ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే'

ఫారం-6, 7, 8 ద్వారా నమోదు, తొలగింపు, సవరణలకు అవకాశం



**కర్నూలు ప్రతినిధి, ఆగస్టు 29, (సీమకిరణం న్యూస్):** "యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో.." అనే పిలుపుతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పెషల్ క్యాంపెయిన్ డే' కార్యక్రమాన్ని శనివారం ఏ.క్యాంపులోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్లో ఈఆర్వో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, వివరాల సవరణ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6, అనర్హులు, మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి పేర్లపై అభ్యంతరం లేదా తొలగింపు కోసం ఫారం-7, పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎస్ఐఆర్ డ్రాఫ్ట్‌లో ఓటు లేని వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదివారం నిర్వహించే 'స్పెషల్ క్యాంపెయిన్ డే'లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హత ఉన్న యువతతో పాటు ప్రతి ఓటరు తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకుని, అవసరమైన సవరణలు చేసుకోవాలని అధికారులు కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

## రేవంత్ రెడ్డి భాషపై ఎథిక్స్ కమిటీలో చర్చించాలి: వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వాడుతున్న పదజాలం, అనుచిత వ్యాఖ్యలపై ఎథిక్స్ కమిటీలో విచారణ జరపాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎథిక్స్ కమిటీ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తరపున తమ వాదనను ఎంతో బలంగా వినిపించామని వెల్లడించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల వివాదం జరిగిన రోజు కేవలం కాంగ్రెస్‌కు చెందిన 23 మంది ఎమ్మెల్యేలతోనే సభలో మాట్లాడించారని... అది ఏ విధంగా 'మూడ్ ఆఫ్ ది హౌస్' అవుతుందని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఏకపక్ష మాటలను ప్రాతిపదికగా చేసుకుని, కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీ ఎజెండాలో చేర్చడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని దుయ్యబట్టారు.సభా నాయకుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించడంపై చర్యలు తీసుకోవాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, మందుల శామ్యూల్‌లు సభలో చేసిన అసభ్య వ్యాఖ్యలు, అనుచిత హావభావాల వీడియో ఆధారాలను కూడా కమిటీకి సమర్పించామని వివరించారు. ఈ విజ్ఞప్తిపై క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

## నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల మెరుపుదాడులు

150 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

అక్రమ మద్యం నిల్వలపై విస్తృత తనిఖీలు





**ప్యాపిలి ఆగస్టు 29 (సీమ కిరణం న్యూస్):** నాటుసారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఎక్సైజ్ సీఐ జాఫ్రుల్లా తెలిపారు. కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు ప్యాపిలి మండలంలో శనివారం విస్తృతంగా దాడులు, తనిఖీలు నిర్వహించారు. ప్యాపిలి మండలం సీతమ్మ తాండ కొండ ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 150 లీటర్ల ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం పీఆర్ పల్లి, నల్లమేకల పల్లి, డి. రంగాపురం,జక్కసానికుంట్ల, చంద్రపల్లి తదితర గ్రామాల్లో అక్రమ మద్యం నిల్వలు, నాటుసారా తయారీ స్థావరాల కోసం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎటువంటి అక్రమ మద్యం నిల్వలు గుర్తించలేదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ జాఫ్రుల్లా మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలపై నిరంతరం దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఎక్కడైనా నాటుసారా తయారీ లేదా అక్రమ మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం ఉంటే 9440902584 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై పి. దౌలత్ ఖాన్, హెడ్ కానిస్టేబుళ్లు సుధాకర్ రెడ్డి, శేషన్న, కానిస్టేబుళ్లు గోపాల్ సింగ్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్, హిందీపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి

డిప్యూటీ ఎంపీడీవో

వై. ప్రభాకర్



**ప్యాపిలి ఆగస్టు 29 (సీమ కిరణం న్యూస్):** స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, హిందీ పండిట్లకు ప్యాపిలి జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్, హిందీ భాషలను విద్యార్థులకు ఏ విధంగా చేరువ చేయాలి, భాషా సామర్థ్యాలను ఏ విధంగా పెంపొందించాలి, సిలబస్‌లో చేసిన మార్పులు, చేర్పులను బోధనలో ఎలా అమలు చేయాలనే అంశాలపై మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీవో వై. ప్రభాకర్ సందర్శించి ఉపాధ్యాయులతో ఇంటరాక్షన్ నిర్వహించారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత చొరవ చూపాలని సూచించారు.

# మన భాషే మన ఆత్మగౌరవం

ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం





**ప్యాపిలి ఆగస్టు 29 (సీమ కిరణం న్యూస్):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి, గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ. ప్రతి ఏడాది ఆగస్టు 29న గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. తెలుగు మన మాతృభాష మాత్రమే కాదని, మన సంస్కృతి, చరిత్ర, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. గిడుగు రామమూర్తి కృషితో వ్యావహారిక భాషకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. తెలుగు అధ్యాపకులు మద్దిలేటి మాట్లాడుతూ. ఇంగ్లీష్ ప్రభావంలో మాతృభాషను మరవకూడదని, తెలుగులో మాట్లాడటం నామోషీ కాదు.. గర్వకారణమని అన్నారు. తెలుగు భాషను ప్రేమించి, కాపాడి, భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి, అధ్యాపకులు అనంతలక్ష్మి, ముస్తాక్, వెంకటేశ్వర్లు, శంకరయ్య, మురళీమోహన్ గౌడ్, సురేష్, మంజునాథ్, వన్నూర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా కేంద్రీయ విద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవం





**డోన్ టౌన్, ఆగస్టు 29,(సీమ కిరణం న్యూస్):** ప్రసిద్ధ హాకీ క్రీడాకారుడు మేజర్ ద్యాన్ చంద్ యొక్క జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రధాన శిక్షకుడు శేష సాయి ఆధ్వర్యంలో డోన్ కేంద్రీయ విద్యాలయం పాఠశాల గ్రౌండ్‌లో గొప్ప ఉత్సాహంతో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పండుగ ప్రదర్శనగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వాగత ప్రసంగం, మేజర్ ధ్యాన్ చంద్‌కు అంకితభావం, క్రీడా ప్రారంభోత్సవం, వినోదాత్మక ఆటలు మరియు ఫిట్‌నెస్ సెషన్ వంటి వాటిని కలిగి ఉంది. తృతీయ, నాల్గవ, ఐదవ మరియు ఆరవ తరగతుల విద్యార్థుల కోసం త్రో బాల్ మరియు కో కో పోటీలు కూడా నిర్వహించబడ్డాయి మరియు పురస్కారాలు, స్మారక వస్తువులు పంపిణీ చేయబడ్డాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు, వారు టీమ్ స్పిరిట్, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ మరియు క్రీడాపరమైన వైఖరిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలోని విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.ఈ వేడుక విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు మరియు శారీరక తయారీ చాలా అవసరమైనవి అనే సందేశాన్ని తెలియజేసారు.

# ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు కర్నూలు రేంజ్ క్రీడాకారుల సన్నద్ధత

పోలీసు అధికారులు, సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లు అందజేసిన డీఐజీ కోయ ప్రవీణ్







**కర్నూలు క్రైమ్, ఆగస్టు 29 (సీమకిరణం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు గుంటూరులో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో కర్నూలు రేంజ్ నుంచి పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ కోయ ప్రవీణ్ పోలీసు క్రీడాకారులను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి కర్నూలు రేంజ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని డీఐజీ తెలిపారు. ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు రేంజ్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు చంద్రబాబు నాయుడు, తేజామూర్తి, తిక్కస్వామి, ఆర్ఐలు, ఎస్ఐలు, స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీమకిరణం నంద్యాల కర్నూలు తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# మోదీని చూసి నేర్చుకుంటేనే...

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని రాజకీయ పార్టీలు భావిస్తుంటాయి. అయితే, ప్రజలు మాత్రం ఎన్నికలు ఏవైనా రాజకీయ పార్టీలకు తమదైన రీతిలో సంకేతాలు, సందేశాలు పంపుతుంటారు. మన దేశంలో ప్రతి ఎన్నిక సందర్భంగా జరుగుతున్నది ఇదే! సోషల్ మీడియా ప్రవేశంతో అప్పుడప్పుడూ ప్రజలు విష ప్రచారం ప్రభావానికి గురవుతున్నప్పటికీ ఆ వెంటనే మేల్కొని రాజకీయ పార్టీలను ఎక్కడ పెట్టాలో అక్కడే పెడుతున్నారు. తాజాగా జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల్లో కూడా ప్రజలు తమదైన శైలిలో రాజకీయ పార్టీలకు సంకేతాలతో పాటు సందేశాలు, హెచ్చరికలూ పంపారు. అధికారంలో ఉన్నవారు మోసాలకు పాల్పడటం వల్ల గెలిచారని ఓడిపోయిన పార్టీలు గగ్గోలు పెడుతున్నాయి కానీ ప్రజల మనసులో ఏముందో అర్థం చేసుకొనే ప్రయత్నం చేయడంలేదు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికలే ఇందుకు ఉదాహరణ. అక్కడ అధికారంలో ఉన్నవారు ఓడిపోయారు. తరాలు మారుతున్నాయి. ప్రజల ఆలోచనలూ మారుతున్నాయని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ప్రతిపక్షాలు గుర్తించడం లేదు. పశ్చిమ బెంగాల్ ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు కంచుకోటగా ఉండింది. నాలుగు దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించాయి. ఇప్పుడు అవే కమ్యూనిస్టు పార్టీలు పశ్చిమ బెంగాల్లో సోదిలో లేకుండా పోయాయి. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన మమతా బెనర్జీ పదిహేనేళ్లపాటు పాలించి తాజా ఎన్నికల్లో ఓడిపోయారు. మూడు పర్యాయాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ పట్ల ముఖం మొత్తని ప్రజలు ఇతర రాజకీయ పార్టీల పట్ల వ్యతిరేకత ఎందుకు ఏర్పరచుకుంటున్నారు అన్న ప్రశ్నకు ప్రతిపక్షాలు, ముఖ్యంగా 'ఇండియా' కూటమి పార్టీలు సమాధానం అన్వేషించుకోవాలి. పొరుగున ఉన్న ఒడిశాలో ఐదు పర్యాయాలు అధికారంలో ఉండిన బిజూ జనతాదళ్‌ను మట్టి కరిపించి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడే మమతా బెనర్జీ మేల్కొని ఉండాల్సింది. అలా చేయకుండా అధికారంలో ఉన్నప్పుడు లెక్కలేనితనంతో వ్యవహరించడంతోపాటు రాజకీయ ప్రత్యర్థి బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకోకుండా ఓటమిని కొనితెచ్చుకున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల నేతృత్వంలో బీజేపీ వరుస విజయాలు ఎలా సాధించగలుగుతోంది? ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కానీ, ఆ పార్టీతో జతకట్టే ఇతర పార్టీలుగానీ ఎన్నికల్లో పరాజయాలను ఎందుకు మూటగట్టుకుంటున్నాయి? అన్న ప్రశ్నలకు సమాధానం తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. మోదీ--షా ద్వయం దేశంలో మరో రాజకీయ పార్టీని బతకనివ్వరా! వ్యవస్థలను చెరబట్టి అధికారంలో కొనసాగుతారా? అని ఆక్రోశం వెళ్లగక్కుతున్న పార్టీలు అలా ఎందుకు జరుగుతోందో తెలుసుకొనే ప్రయత్నం చేయడం లేదు. పశ్చిమ బెంగాల్లో కమ్యూనిస్టుల పాలన సాగినప్పుడు భయానక వాతావరణం ఉండింది. ఎదిరించిన ఎందరో హత్యలకు గురయ్యారు. శాంతిభద్రతలు అడుగంటాయి. అభివృద్ధి మృగ్యమైంది. దీంతో బిక్కు బిక్కుమంటూ గడిపిన ప్రజలు మమతా బెనర్జీ రూపంలో ప్రత్యామ్నాయం కనిపించగానే ఆదరించి అందలం ఎక్కించారు. వామపక్షాల నుంచి అధికారం కైవసం చేసుకున్న మమతా బెనర్జీ కూడా కామ్రేడ్ల బాటలోనే నడిచారు. తృణమూల్ కాంగ్రెస్ మూకలు రెచ్చిపోయాయి. ప్రజల హక్కులను హరించారు. అత్యాచారాలు, హత్యాకాండ నిత్యకృత్యమయ్యాయి. ఒక వర్గం ప్రజలను అతిగా సంతృప్తిపరిచేందుకు మరో వర్గం ప్రజలను నిర్లక్ష్యం చేశారు. అత్యాచారానికి గురైన ఒక మహిళ తనకు న్యాయం జరిగే వరకు, అంటే మమతా బెనర్జీ అధికారం కోల్పోయే వరకు కాళ్లకు చెప్పులు ధరించనని శపథం చేశారు. అత్యాచారానికి గురవడంతోపాటు హత్యకు గురైన ఒక వైద్య విద్యార్థిని తల్లి ఆవేదన కూడా ఇదే విధంగా ఉండింది. ఈ ఇద్దరు మహిళలకు తాజా ఎన్నికల్లో బీజేపీ టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలుగా గెలిపించుకుంది. పశ్చిమ బెంగాల్ ప్రజల వెతలను గుర్తించిన బీజేపీ అగ్ర నాయకత్వం ఆ రాష్ట్రంపై దృష్టిని కేంద్రీకరించింది. తక్షణ ఫలితాలు ఆశించకుండా పదిహేనేళ్ల పాటు నిరీక్షించి మరీ ఆ రాష్ట్రాన్ని జయించింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వారిని మమతా బెనర్జీ నెత్తిన పెట్టుకుంటున్నారని ప్రచారం చేస్తూ స్థానిక ముస్లింలలో కూడా చీలిక తీసుకురావడంలో బీజేపీ విజయం సాధించింది. అసోంలో కూడా ఆ పార్టీ ఇదే ఫార్ములాతో స్థానిక ముస్లింలలో కొందరిని తన వైపునకు తిప్పుకొంది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా మాత్రమే ఎన్నికల్లో అత్యధిక విజయాలు ఎందుకు నమోదు చేయగలుగుతున్నారు? పన్నెండేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ ఎందుకు పుంజుకోలేకపోతున్నది? అన్న ప్రశ్నలకు సమాధానం లేకపోలేదు. 'పార్టీ కోసం నేనేం చేయాలి?' అని బీజేపీ నాయకులు ఆలోచిస్తారు. 'పార్టీ నాకోసం ఏం చేసింది?' అని కాంగ్రెస్ నాయకులు ఆలోచిస్తారు. రెండు పార్టీల మధ్య ఇంత మౌలికమైన తేడా ఉన్నప్పుడు ఫలితాలు ఇలాగే ఉంటాయి. ఇక మోదీ -- అమిత్ షాల విషయానికి వద్దాం. వారిరువురికీ రాజకీయం తప్ప మరో ధ్యాస ఉండదు. ప్రధాని మోదీ దినచర్య ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. పగలంతా ఏం చేస్తారో కూడా తెలియదు. అధికారిక కార్యక్రమాలు, సమీక్షలలో పాల్గొన్న దాఖలాలు కనిపించవు. పాలనా వ్యవహారాలను నమ్మకస్తులైన అధికారులకు అప్పగించి కేవలం మార్గదర్శనం చేస్తారట! తన సమయంలో అధిక భాగాన్ని రాజకీయ వ్యూహ రచనకే ఆయన కేటాయిస్తారని చెబుతారు. రెండేళ్ల తర్వాత జరిగే ఎన్నికలపై ఆయన ఇప్పటి నుంచే దృష్టి పెడతారు. ప్రతి సందర్భాన్నీ ఆ దృష్టితోనే చూస్తారు. ఆలోచనలు మోదీవి కాగా, వాటిని అమలు చేసే బాధ్యత అమిత్ షా తీసుకుంటారు. అసోం, పశ్చిమ బెంగాల్లో పాగా వేయాలనే లక్ష్యంతో అక్కడ ప్రత్యర్థి పార్టీలలో బలమైన నాయకులను గుర్తించి, వారిని బీజేపీలోకి ఆహ్వానించి అవసరమైన అండదండలు అందించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన హిమంత బిశ్వశర్మను పార్టీలోకి తీసుకొని ముఖ్యమంత్రిని చేశారు. కాంగ్రెస్ పార్టీకి బలమైన నాయకత్వం లేకుండా చేశారు.పశ్చిమ బెంగాల్లో కూడా మమతా బెనర్జీ వ్యవహార శైలి పట్ల అసంతృప్తితో ఉన్న సువేందు అధికారికి గేలం వేశారు. ఆయనను పార్టీలోకి తీసుకొని మమతా బెనర్జీపై యుద్ధం ప్రకటించారు. ఒకప్పటి కమ్యూనిస్టుల కోట అయిన పశ్చిమ బెంగాల్లో బీజేపీ అధికారంలోకి రాగలదని ఎవరైనా ఊహించారా? తాజా ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో బీజేపీ అధికారం చేజిక్కించుకుంది. సువేందు అధికారిని ముఖ్యమంత్రిని చేశారు. ముల్లును ముల్లుతోనే తీయడం అంటే ఇదే కదా! ఓట్ల చోరీకి పాల్పడటం ద్వారా గెలిచారన్న మమతా బెనర్జీ వంటి వారి ఆరోపణలు తర్కానికి నిలబడటం లేదు. పోలింగ్ సందర్భంగా తమ ఓట్లు గల్లంతయ్యాయని ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలో ప్రజలెవరూ గొడవలకు దిగకపోవడమే ఇందుకు నిదర్శనం.రు ప్రత్యర్థుల బలాలు, బలహీనతల గురించి ముందుగా తెలుసుకోవాలి. ఈ విషయంలో ప్రధాని మోదీని మించిన వారు వర్తమాన రాజకీయాలలో మరొకరు కనిపించరు. ప్రత్యర్థి బలాలు, బలహీనతలతోపాటు ప్రజల సైకాలజీ అధ్యయనం చేసి తదనుగుణంగా వ్యూహ రచన చేయడంలో నరేంద్ర మోదీ దిట్ట. ఎన్నికలకు ముందు రచించే వ్యూహాలే కాదు, ఫలితాల తర్వాత వ్యూహాలు రచించడంలోనూ మోదీకి మోదీయే సాటి. ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారోత్సవ సభలో బెంగాలీ ప్రజలకు ప్రధాని మోదీ చేసిన సాష్టాంగ ప్రణామం ఆ కోవలోదే. రాజకీయాల్లో అదో మాస్టర్ స్ట్రోక్ అనే చెప్పాలి. మరో ఎన్నిక దాకా బెంగాలీ ప్రజల చూపు బీజేపీ వైపే ఉండేలా కట్టిపడేసే తారక మంత్రం. ఈ దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ సెక్యులరిజం పేరిట ముస్లింలను ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు అతిగా వ్యవహరించిందన్న భావన దేశంలోని మెజారిటీ వర్గం ప్రజల్లో ఎప్పటి నుంచో ఉంది. మెజారిటీ ప్రజల మనోభావాలను గుర్తించిన ప్రధాని మోదీ తన రాజకీయాన్నీ అక్కడి నుంచే ప్రారంభించారు. గుజరాత్‌లో గోధ్రా సంఘటన జరిగిన తర్వాత ముస్లింలు ఊచకోతకు గురయ్యారు. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ ఆశీస్సులతోనే నాటి మారణ హోమం జరిగిందని ప్రచారమైంది. అమెరికా వంటి దేశాలు మోదీకి వీసా కూడా నిరాకరించాయి. అయినా కూడా మోదీ వెనుకంజ వేయలేదు. ఫలితంగా ఇప్పుడు గుజరాత్‌లో బీజేపీ వరుస విజయాలు సొంతం చేసుకుంటోంది. మోదీ అధికారంలోకి రాకముందు గుజరాత్‌లో తరచుగా మత కలహాలు జరిగేవి. ఇప్పుడు మచ్చుకు కూడా కనిపించడం లేదు. గుజరాత్ ప్రజల మనసుల్లో ఏం ఉండిందో మిగతా రాష్ట్రాల ప్రజల మనసుల్లో కూడా అదే ఉంటుందని భావించిన నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యాక గుజరాత్ ఫార్ములానే మిగతా రాష్ట్రాల్లోనూ అమలుచేసి విజయాలు అందుకుంటున్నారు.విశేషం ఏమిటంటే, బీజేపీకి మతతత్వ పార్టీ అన్న ముద్ర ఉన్నప్పటికీ ఆ పార్టీ ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో మత కలహాలు జరగకపోవడంతో ముస్లింలు కూడా ప్రశాంతంగా జీవించగలుగుతున్నారు. అలా కాకుండా గతంలోవలె మత కలహాలు జరుగుతూనే ఉంటే బీజేపీ పట్ల కూడా ప్రజలకు ముఖం మొత్తి ఉండేది. అవినీతి, కుటుంబ పాలన కూడా బీజేపీ అధికారంలో ఉన్న చోట కనిపించవు. బీజేపీ ఏలుబడి ఉన్న రాష్ట్రాలలో అసలు అవినీతి లేదా? అంటే లేదు అని చెప్పుకోకూడదు. కాకపోతే హద్దుల్లేని అవినీతి ఉండదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌తో పాటు ఆ పార్టీతో కలిసి నడుస్తున్న పార్టీలు ఆత్మ పరిశీలన చేసుకోకుండా... ఆత్మస్తుతి, పరనిందలతో కాలక్షేపం చేస్తున్నాయి. దీంతో మెజారిటీ ఓటర్లకు ఏకైక ప్రతినిధిగా బీజేపీ ఆవిర్భవించింది. మైనారిటీ వర్గాల ఓట్ల కోసం మిగతా పార్టీలు కొట్టుకుంటున్నాయి. ఈ కారణంగానే బీజేపీ వరుస విజయాలు అందుకోగలుగుతోంది. ప్రధాని మోదీలాగా రాజకీయాలను సూక్ష్మ స్థాయిలో పరిశీలిస్తూ పూర్తి సమయం అందుకోసమే కేటాయించే నాయకులు కాంగ్రెస్‌లోగానీ, ఇతర పార్టీలలోగానీ కనిపించడం లేదు.తమిళనాడు ఎన్నికలను మాత్రమే కాదు--శ్రీలంకతో సత్సంబంధాలను పెంపొందించుకోవడానికి వీలుగా ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రధాని మోదీ ఎంపిక చేశారు. హిందీలో ఒక ముక్క కూడా మాట్లాడలేని రాధాకృష్ణన్‌ను ఈ పదవికి ఎంపిక చేస్తున్నట్టు మోదీ ప్రకటించినప్పుడు పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు ఆశ్చర్యపోయారు. ఇలాంటి సందర్భాలు ఎన్నో ఉన్నాయి. గుజరాత్‌లో సోమనాథ్ దేవాలయం జీర్ణోద్ధరణ జరిగి 75 సంవత్సరాలైన సందర్భంగా ప్రధాని మోదీ చేస్తున్న ప్రచారాన్ని ఆషామాషీగా తీసుకోకూడదు. మెజారిటీ ప్రజలను మరింత సంఘటిత పరిచేందుకు ఆయన ఈ సందర్భాన్ని వాడుకుంటున్నారు. ఈ దేశంలో ఎన్నో దేవాలయాలను జీర్ణోద్ధరణ చేశారు. కానీ, సోమనాథ్ దేవాలయం విషయంలోనే ఎందుకింత ప్రచారం చేస్తున్నారంటే కారణం ఉంది. ఈ దేవాలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉండటమే కాదు-- దాన్ని ధ్వంసం చేయడానికి గతంలో ఎంతో మంది ప్రయత్నించి విఫలం చెందారు. ఈ నేపథ్యంలోనే గతంలో ఏం జరిగిందో ప్రజలకు తాజాగా తెలియజెప్పే ప్రయత్నం చేయడం ద్వారా మెజారిటీ ప్రజల మనసు గెలవాలని ప్రధాని మోదీ చూస్తున్నారు. ఆయన నోటి నుంచి వెలువడే ప్రతి మాటలో, వేసే ప్రతి అడుగులో రాజకీయం ఉంటుంది. కాంగ్రెస్‌తో సహా మిగతా ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గుర్తించకుండా మతతత్వ పార్టీ అని బీజేపీని నిందించుకుంటూ పోవడం వల్ల ఫలితం ఉండదు. పుదుచ్చేరిలో ముఖ్యమంత్రి రంగస్వామిని అక్కడి ప్రజలు వరుసగా ఎందుకు ఆదరిస్తున్నారు? మమతా బెనర్జీని ఎందుకు తిరస్కరించారు? అని ప్రతిపక్షాలు ప్రశ్నించుకుని సమాధానం కోసం ప్రయత్నిస్తే శాపనార్థాలు పెట్టే ప్రయాస తప్పుతుంది.తాజా ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్ ప్రజలు అరాచక పాలనకు వ్యతిరేకంగా బలమైన సందేశాన్ని పంపగా, తమిళనాడు ప్రజలు విలక్షణమైన సందేశం ఇచ్చారు. అడ్డగోలు సంక్షేమ పథకాలు, ఎన్నికల్లో డబ్బు పంచడం వంటివి తమను ఏమాత్రం ప్రభావితం చేయవని తమిళ ప్రజలు రుజువు చేశారు. తమిళనాడు అంటేనే ద్రవిడ ఉద్యమం గుర్తుకొస్తుంది. జాతీయ గీతంలో ద్రవిడ, ఉత్కళ, వంగ అని ఉందే కానీ తమిళ, తెలుగు, కన్నడ, మలయాళం అని ఉండదు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ద్రవిడనాడు అస్తిత్వం బలంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తమిళనాడు కొంతకాలం పాటు కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్నప్పటికీ ఆ తర్వాత ద్రవిడ ఉద్యమం బలపడి డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలు ఆవిర్భవించి జాతీయ పార్టీలకు తావు లేకుండా చేశాయి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్--బీజేపీ వంటి జాతీయ పార్టీలు తోక పార్టీలుగా మారాయి. ఆరు దశాబ్దాలకు పైగా డీఎంకే, ఏఐఏడీఎంకేలే అధికారంలో ఉన్నాయి. దీంతో తమిళనాడు తమ సొంతం అని, మరో పార్టీకిగానీ నాయకుడికిగానీ ఇక్కడ తావు లేదని ఆ రెండు పార్టీలూ భావిస్తూ వచ్చాయి. తరాలు మారాయి. ద్రవిడ ఉద్యమంతో నేటి తరానికి బంధం తెగిపోయిందని గుర్తించలేక పోయారు.

# నీట్ - పీజీ పరీక్షకు పటిష్ట బందోబస్తు

**7 పరీక్షా కేంద్రాల్లో 2,144 మంది అభ్యర్థులు.. ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతి**

**ఉదయం 8.30 గంటల్లోపు అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు (క్రైమ్, ఆగస్టు 29, (సీమకిరణం న్యూస్):** ఆదివారం (ఆగస్టు 30, 2026) కర్నూలు జిల్లా వ్యాప్తంగా 7 పరీక్షా కేంద్రాల్లో నీట్ - పీజీ -2026 పరీక్ష నిర్వహించనున్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, మొత్తం 2,144 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

### ఉదయం 7 గంటల నుంచే అనుమతి

పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 7 గంటల నుంచే అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఉదయం 8.30 గంటల్లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అన్ని నియమ నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాసి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకాంక్షించారు.

### సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ తెలిపారు. పరీక్షా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### కర్నూలు జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాలు

1. ఐయాన్ డిజిటల్ జోన్ -- కర్నూలు
   పూజ్య ఎడ్యుకేషనల్ సొసైటీ, డా. కె.వి. సుబ్బారెడ్డి స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, దూపాడు, కల్లూరు మండలం.
2. డా. కె.వి. సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
   దూపాడు రైల్వే స్టేషన్ -- లక్ష్మీపురం పోస్ట్.
3. ఐయాన్ డిజిటల్ జోన్ -- దూపాడు
   దూపాడు రైల్వే స్టేషన్ ఎదురుగా, లక్ష్మీపురం పోస్ట్.
4. జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్
   నంద్యాల రోడ్, కర్నూలు.
5. యునిడాడ్ టెక్నాలజీస్, సర్వీసెస్
   నంద్యాల చెక్ పోస్టు, కర్నూలు.
6. భీమా ఇంజనీరింగ్ కాలేజ్
   ఆలూరు రోడ్డు, ఆదోని.
7. సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజ్
   ఎర్రకోట, ఎమ్మిగనూరు.



### హెల్ప్ డెస్క్ / కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నీట్ - పీజీ -2026 పరీక్షల నిర్వహణకు సంబంధించి కర్నూలు కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ / కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు, సలహాలు అవసరమైతే హెల్ప్ డెస్క్ ల్యాండ్‌లైన్ నంబర్ 08518-277305ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకుని, నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి విజయవంతం కావాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకాంక్షించారు.

# రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలకు పటిష్ట భద్రత







**రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలకు 300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు**

**భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు క్రైమ్ , మంత్రాలయం, ఆగస్టు 29 (సీమకిరణం న్యూస్):** మంత్రాలయంలో జరుగుతున్న శ్రీ రాఘవేంద్ర స్వామి 355వ సప్తరాత్రోత్సవాల సందర్భంగా భద్రతా ఏర్పాట్లను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు చేపట్టిన భద్రతా చర్యలను ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. ముఖ ద్వారం నుంచి శ్రీమఠం వరకు క్యూ లైన్లు, ఆలయ ప్రాకారం, తుంగభద్ర నది తీర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



### నిఘా నేత్రాలతో నిరంతర పర్యవేక్షణ

ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫాల్కన్ వాహనం, డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, సీసీ కెమెరాలు తదితర భద్రతా పరికరాల పనితీరును పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, ఆలయ పరిసరాల్లో నిరంతర నిఘా, తుంగభద్ర నది తీర ప్రాంతాల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. సప్తరాత్రోత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి శ్రీమఠం సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, మంత్రాలయం సీఐ దస్తగిరి, సీఐ రామాంజులు, శ్రీమఠం అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిరియాలో పెనుమార్పులు



సిరియాలో ఐదు దశాబ్దాల అసద్ వంశీయుల నిరంకుశ పాలనకు తెరపడింది. తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్‌ను చుట్టుముట్టిన వేళ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మాస్కోకు పారిపోయి తలదాచుకున్నాడు. తిరుగుబాటు దళాలు గాల్లోకి కాల్పులు జరుపుతూ సంబురాలు జరుపుకొంటున్నాయి. ఒకప్పటి అల్ కాయిదా నేత అహ్మద్ అల్ శరా తన గతాన్ని, పాత మారు పేరును వదిలించుకొని సిరియా పగ్గాలు చేపట్టారు. ఈ పరిణామాలు అంతర్యుద్ధంతో పదిహేనేండ్ల కాలంపాటు కకావికలమైపోయిన సిరియాకు శాంతిని ప్రసాదించగలవా? లేక పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అవుతుందా అనేదే అసలు ప్రశ్న. అసద్ ప్రభుత్వ పతనం తర్వాత జరుగుతున్న కొన్ని పరిణామాలు కలిగిస్తున్న ఆందోళనే ఇందుకు కారణం. సందట్లో సడేమియా అన్నట్టుగా ఇజ్రాయెల్ ప్రస్తుత అస్థిర పరిస్థితులను అలుసుగా తీసుకొని దాడులకు తెగబడుతున్నది. సరిహద్దు భూభాగాలను రాత్రికి రాత్రే ఆక్రమించుకుంది. అంతేకాకుండా రసాయనిక ఆయుధ కేంద్రాలు, క్షిపణి స్థావరాలుగా భావిస్తున్న ప్రదేశాలపై బాంబు దాడులకు పాల్పడుతున్నది. అగ్రరాజ్యం అమెరికా 'నేనేం తక్కువ తిన్నానా' అన్నట్టుగా ఇస్లామిక్ స్టేట్ శక్తులను దెబ్బతీసే సాకుతో 75 ప్రదేశాలపై బాంబులు వేసింది. ఈ దాడులు ఏ మాత్రం వాంఛనీయమైనవి కావు. ఈ దుందుడుకు చర్యల పర్యవసానాలు ఎలా ఉంటాయో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. అంతర్జాతీయ శక్తుల ప్రచ్ఛన్న యుద్ధానికి సిరియా వేదికగా మారిన సంగతి తెలిసిందే. ప్రధానంగా అమెరికా, రష్యా, సౌదీ అరేబియా, ఇరాన్ తమ తమ ప్రాబల్యం కోసం సిరియాలో రకరకాల శక్తులను వెనకేసుకు వస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంలో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రష్యా మద్దతు తగ్గించడం వల్లనే అసద్ ప్రభుత్వం పతనమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. షియా-సున్నీ విభేదాలు, రష్యా-అమెరికా తగాదాలకు నెలవుగా మారిన సిరియా బలమైన కేంద్రం అనేది లేకపోవడం కారణంగా ఇప్పుడు జిహాదీ శక్తుల చేతుల్లోకి వెళ్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కారణంగా శాంతి ఎండమావిగా మారి, అంతర్జాతీయ ఉగ్రవాదం పెచ్చరిల్లేందుకు ఆస్కారం ఉన్నది. ఇది సిరియాకే కాకుండా యావత్తు ప్రపంచానికి సమస్యగా పరిణమించవచ్చు. ఇందుకు మనకు అఫ్గానిస్థాన్, ఇరాక్ ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. అసద్ ప్రభుత్వం కూలిపోవడాన్ని సిరియాలో శాశ్వత శాంతిస్థాపనకు ఒక సువర్ణావకాశంగా ప్రపంచ దేశాలు భావించాలి. 2017లో రష్యా, ఇరాన్, టర్కీ ఆధ్వర్యంలో చేపట్టిన అస్తానా శాంతి చర్చల క్రమాన్ని కొనసాగించాలి. ఉద్రిక్తతలు తగ్గించి, మానవతా సహాయం చేరవేతకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడం, రాజకీయ చర్చలకు వీలు కల్పించడం అనే త్రిముఖ వ్యూహంతో ఆ చర్చలు మొదలయ్యాయి. 22 విడతల చర్చలు జరిగినా నిర్వాహకులు ప్రత్యర్థి వర్గాలను చెరోవైపున సమర్థిస్తుండటంతో పెద్దగా పురోగతి సాధ్యపడలేదు. అయితే, పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఏమీ లేదు. సంక్షోభం ముదురుతున్న దశలో మొన్నటి శనివారం మూడు నిర్వాహక దేశాలు ఖతార్ రాజధాని దోహాలో సమావేశమై సిరియాలో కాల్పుల విరమణ, రాజకీయ సంప్రదింపులు, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం ఐక్య రాజ్య సమితి భద్రతామండలి చేసిన 2,254 తీర్మానాన్ని అమలుచేయడంపై ఏకాభిప్రాయానికి రావడం ముదావహం. ఇందుకు సంబంధించిన ఉమ్మడి ప్రకటనపై పైన తెలిపిన మూడు దేశాలతో పాటుగా ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఇరాక్, జోర్డాన్, ఖతార్ సంతకాలు చేశాయి. ఇదే అదనుగా ఐరాస చొరవ తీసుకొని సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు దిశగా కృషిచేయాలి. అంతిమంగా స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు వీలైన పరిస్థితులు కల్పించాలి.

# చలికాలంలో కిడ్నీలను కాపాడుకుందాం ఇలా

చలికాలం.. కిడ్నీలకు కీడు తెస్తుంది. చల్లని వాతావరణం.. మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శీతకాలంలో రోగనిరోధక శక్తి తగ్గిపోవడం.. కిడ్నీల పనితీరును మరింత దెబ్బతీస్తుంది. 'చలి'లో దాహం వేయకపోవడం, నీళ్లు తక్కువగా తీసుకోవడం కూడా.. మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. ఈ క్రమంలో కిడ్నీలను కాపాడుకోవాలంటే.. ప్రత్యేక ఆహారాన్ని తీసుకోవడంతోపాటు, కొన్ని పదార్థాలను దూరం పెట్టాల్సిన అవసరం ఉన్నది. వేసవి, వర్షాకాలంతో పోలిస్తే.. చలికాలంలో రక్తపోటు అధికంగా ఉంటుందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో సమర్పించిన కొత్త పరిశోధన చెబుతున్నది. దీని అధిక రక్తపోటు.. కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. మూత్రపిండాల్లోని రక్తనాళాలపై అధిక ఒత్తిడి పడి.. బలహీనంగా మారిపోతాయి. క్రమంగా కిడ్నీలు పనిచేయకుండా పోతాయి. కాబట్టి, ఆహారంలో ఉప్పును తగ్గించాలి. బీపీని కంట్రోల్‌లో ఉంచుకోవాలి. చలికాలంలో తీపి పదార్థాలపైకి మనసు ఎక్కువగా మళ్లుతుంది. కాఫీలు, టీలు తాగడం కూడా పెరుగుతుంది. ఈ రెండు కారణాలతో రక్తంలో చక్కెర స్థాయులు అదుపు తప్పుతాయి. కిడ్నీలు దెబ్బతిని.. 'డయాబెటిక్ నెఫ్రోపతీ' అనే పరిస్థితికి దారితీస్తుంది. ఫలితంగా.. రక్తంలోని వ్యర్థాలను వడపోసే సామర్థ్యం తగ్గిపోతుంది. ఇది దీర్ఘకాలికంగా కొనసాగితే.. కిడ్నీలు పనిచేయకుండా పోతాయి. కాబట్టి, ఈకాలంలో తీపిని దూరం పెట్టడమే క్షేమం. శీతకాలంలో చెమట తక్కువగా పడుతుంది. దాంతో చెమట రూపంలో బయటికి వెళ్లిపోవాల్సిన సోడియం.. మూత్రంలో కలిసిపోతుంది. ఫలితంగా.. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి, ఈ సమస్య నుంచి బయటపడేందుకు నిత్యం వ్యాయామం తప్పనిసరి. ఒళ్లంతా చెమట పట్టేలా.. వ్యాయామం చేయడం మంచిది. చలికాలంలో జలుబు, దగ్గు, తుమ్ములు, జ్వరాలు.. ఇలా అనేక



ఆరోగ్య సమస్యలు పలకరిస్తాయి. వాటి నుంచి బయటపడేందుకు ట్యాబ్లెట్లను ఆశ్రయిస్తుంటారు చాలామంది. అయితే, కొన్నిరకాల మందులు కిడ్నీల పనితీరుపై ప్రభావం చూపుతాయి. కిడ్నీలకు రక్తప్రసరణను తగ్గిస్తాయి. అందుకే.. చిన్నచిన్న సమస్యలకూ మాత్రలు వేసుకోవడం తగ్గించాలి.

### వీటిని తినాల్సిందే..

ఒమేగా-3 కొవ్వులు అధికంగా ఉండే సాల్మన్, ట్యూనా చేపలను తినడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుందని 'నేషనల్ కిడ్నీ ఫౌండేషన్' అధ్యయనం చెబుతున్నది. వీటి వల్ల రక్తంలో కొవ్వు స్థాయులు, అధిక రక్తపోటు తగ్గి.. మూత్రపిండాలపై ఒత్తిడి తగ్గుతుంది.

సిట్రస్ జాతి పండ్లు.. మూత్రపిండాల్లోని రాళ్లను కరిగిస్తాయి. మూత్రనాళాలను సంరక్షిస్తాయి.

పొటాషియం అధికంగా ఉండే చిలగడ దుంపలు.. శరీరంలో సోడియం స్థాయులను సమతుల్యం చేస్తాయి. మూత్రపిండాలపై సోడియం ప్రభావాన్ని తగ్గిస్తాయి.

నీటి శాతం ఎక్కువగా ఉండే దోసకాయలు.. శరీరంలోని టాక్సిన్స్‌ను బయటికి పంపించడంతోపాటు మూత్ర పిండాలను హైడ్రేటెడ్‌గా ఉంచడంలోనూ ముందుంటాయి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com